సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 16 । ఫిబ్రవరి । 2023



'ఎస్పీఎల్' విజేత తిరుపతి

'సాక్షి ప్రీమియర్ లీగ్' సీనియర్ విభాగం క్రికెట్ పోటీల విజేతగా తిరుపతి సీకాం జట్టు, జూనియర్స్ విభాగంలో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ జట్టు నిలిచాయి. -8లో..



చెరువులో పడి విద్యార్థి మృతి

బోయనపల్లె జడ్పీ హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న చరణ్ తేజ్ (11) మన్నూరు చెరువులో పడి మృతి చెందాడు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.90	రూ.186



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 169 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	711	711
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 69.12 కిలోలు

జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె వద్ద జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ భూమి పూజ కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, స్థానికులు (ఇన్‌సెట్) ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి





ఉక్కు నగరానికి తొలి అడుగు

పారిశ్రామిక రంగంలో కడప గడపను పరుగులెత్తించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే కొప్పర్తి పారిశ్రామిక వాడలో అనేక కంపెనీలు వివిధ పరిశ్రమలు ఏర్పాటు చేస్తుండగా.. మరోవైపు జమ్మలమడుగు సమీపంలోని సున్నపురాళ్లపల్లెలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి భూమి పూజ చేయడంతో జిల్లా పారిశ్రామిక ప్రగతి దిశగా దూసుకెళుతోందంటూ సర్వత్రా హర్షామోదాలు వ్యక్తమవుతున్నాయి.

- ఉక్కుఫ్యాక్టరీ నిర్మాణానికి భూమి పూజ చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- 16ఏళ్ల నాటి కల సాకారం కానుండటంపై సర్వత్రా హర్షం
- మరో రెండేళ్లలో ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాల వెల్లువ
- అదే స్పష్టం చేసిన జేఎస్‌డబ్ల్యూ అధినేత సజ్జన్ జిందాల్
- ప్రపంచం చూపు కడప స్టీల్ ప్లాంట్ వైపు ఉంటుందని ధీమా



స్టీల్ ప్లాంట్‌కు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీఎం వైఎస్ జగన్, సజ్జన్ జిందాల్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం వైఎస్ జగన్, సజ్జన్ జిందాల్

సాక్షి ప్రతినిధి, కడప: ఉక్కు నగరానికి బీజం పడింది. 16 ఏళ్ల నాటి కల సాకారం దిశగా అడుగులు పడ్డాయి. రాయలసీమ వాసుల ఆకాంక్షకు అనుగుణంగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ ఉపాధి అవకాశాలు ముంగిట్లో కొలువు దీరనున్నాయి. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపురాళ్లపల్లెలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్స్ గ్రూప్ సారథ్యంలో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమి పూజ చేశారు. ముఖ్యమంత్రి సంకల్పబలం.. పటిష్ట చర్యలు.. చిత్తశుద్ధి.. వెరసి దేశంలో అగ్రగామి సంస్థ కడప గడపలో అడుగుపెట్టింది. ప్రపంచంలోనే మోడల్ స్టీల్స్‌గా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించుకుంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయం నెరవేరనుంది.

వడ్డించే వ్యక్తి మనోడైతే..

రూ.8800 కోట్లతో 3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో 25 వేల మందికి ప్రత్యక్ష ఉద్యోగ అవకాశాలతో రాయలసీమ నడిబొడ్డున స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అందుకోసం కడప బిడ్డగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.700 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ఉక్కు నగరంగా కడప కీర్తి విశ్వవ్యాప్తం చేయాలనే దిశగా అడుగులు వేస్తున్నారు. అన్ని రకాలుగా మౌలిక వసతులు కల్పించడంతో రూ.1.75 లక్షల కోట్లు టర్నోవర్‌తో దేశంలో అగ్రగామిగా నిలుస్తున్న జేఎస్‌డబ్ల్యూ సంస్థ కడపకు రాగలిగిందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. వడ్డించే వ్యక్తి మనోడు కావడమే అందుకు ప్రధాన కారణమని పలువురు పేర్కొంటున్నారు. ఇక్కడి ప్రజల పట్ల, ప్రాంతం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉండడంతోనే సాధ్యమైందని వివరిస్తున్నారు.

మరో రెండేళ్లలో ఉద్యోగాల వెల్లువ..

అటు జమ్మలమడుగు స్టీల్ ప్లాంట్.. ఇటు కొప్పర్తి పారిశ్రామికవాడతో జిల్లా రూపురేఖలు మారిపోనున్నాయి. చదువుకున్న ప్రతి యువకుడు ఉద్యోగ సాధనకు మరెక్కడో వెతికే పనిలేకుండా పోతుంది. ఇప్పటికే కొప్పర్తిలో 550 ఎకరాల్లో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ) నెలకొల్పారు. రూ.10వేల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు రానున్నాయి. దాదాపు లక్ష మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. అక్కడే 3,155 ఎకరాల్లో జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు కాబోతోంది. దాదాపు రూ.18వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయి. మరో 1.75 లక్షల ఉద్యోగాలు దక్కనున్నాయి. స్థానికులకే 75 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే చట్టం కారణంగా భారీగా ఉద్యోగాలు లభించనున్నాయి.

అందరితో మమేకం...

పులివెందుల అంటేనే వైఎస్. వైఎస్ అంటే పులివెందుల అనే విషయం తెలుగువారందరికీ తెలిసిందే. వైఎస్సార్‌సీపీ నాయకుడు బలరామిరెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొని అందరితో మమేకమయ్యారు. యువకులు కరచాలనం కోసం ఉత్సాహం చూపగా.. మరోవైపు ఆయన ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరిస్తూ ముందుకు కదిలారు. ఈలోగా 80 ఏళ్ల వయసున్న వృద్ధురాలు ఎర్రబెల్లికి చెందిన వెంకటమ్మ జగన్ సార్ అంటూ పేరు పెట్టి పిలిచింది. సిబ్బంది ద్వారా ఆ వృద్ధురాలిని దగ్గరకు పిలుచుకొని అక్కున చేర్చుకోవడంతో ఆమె కళ్లు జిగేల్ మంటూ వెలిగిపోయాయి. ఏమైనా ఇబ్బందులున్నాయా అవ్వా అంటూ సీఎం ఆప్యాయంగా అడగగా.. ఏమీ లేవు నాయనా...సీఎం అయ్యాక నిన్ను చూడాలన్పించి గట్టిగా కేక పెట్టానని వెంకటమ్మ జవాబిచ్చింది. ఈ ప్రాంత ప్రజలకు వైఎస్ కుటుంబం పట్ల ఉన్న ప్రత్యేక అభిమానాన్ని ఈ సంఘటన ఇట్టే స్పష్టం చేస్తోంది. అంతే చిత్తశుద్ధి.. అభిమానంతో జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళుతున్నారనే అభిప్రాయం అన్ని వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్ రెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తదితరులు

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో..

జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లెలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మోడల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ స్పష్టం చేశారు. బళ్లారిలో తొలుత 1.2 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఏర్పాటు చేశామని ఇవాళ 13 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఉత్పత్తి చేస్తోందని తెలిపారు. అక్కడి కంటే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిస్తున్న ఈ స్టీల్ ప్లాంట్ ప్రపంచం దృష్టి ఆకర్షిస్తోందని ఆయన స్పష్టం చేశారు. స్థిరత్వం, అభివృద్ధి రెండూ ఒకటిగా సాధించే దిశగా మనమంతా కలిసి పని చేద్దామని ఇక్కడి ప్రజానీకానికి పిలుపునిచ్చారు. సంపదను కూడా కేవలం సంస్థ మాత్రమే కాకుండా, అందరం కలిసి పంచుకుందామని సజ్జన్ జిందాల్ వెల్లడించడం వెనుక దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పట్ల ఉన్న గురుత్వం, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో ఉన్న సాన్నిహిత్యమే కారణమని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

న్యూస్‌రీల్

గంగమ్మ జాతరకు పటిష్ట బందోబస్తు:ఎస్పీ



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

లక్కిరెడ్డిపల్లి: ఈనెల 21,22వ తేదీల్లో జరిగే గంగమ్మ జాతర జరగనుంది. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టిబందోబస్తు ఏర్పాటు చేస్తామని అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. బుధవారం గంగమ్మ జాతర ప్రాంగణాన్ని ఆయన పరిశీలించి, అమ్మవారిని దర్శించుకున్నారు. డీఎస్పీ శ్రీధర్, సీఐ యుగంధర్‌లతో జాతర ఏర్పాట్ల గురించి చర్చించారు. జాతరలో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.చాందినీ బండ్ల ఎదుట అశ్లీల నృత్య ప్రదర్శనలు జరపకూడదన్నారు. కార్యక్రమంలో సీఐ వరప్రసాద్, ఎస్ఐ వినోద్ కుమార్, ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, కార్యనిర్వహణ అధికారి రవీంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ ధనలక్ష్మి

రాయచోటి అర్బన్: జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు,బాలింతలకు పౌష్టికాహారం పంపిణీలో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ ఎం.ధనలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 2275 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయన్నారు. వీటి ద్వారా బాలింతలు,చిన్నారులు, గర్భిణులకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. వీరు ఇక్కడే భోజనం చేసేలా చూడాలని తమ పరిధిలోని సీడీపీఓలందరికీ స్పష్టమైన ఆదేశాలు జారీచేసినట్లు చెప్పారు. పౌష్టికాహారం నాణ్యతలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. సీడీపీఓలు, సూపర్‌వైజర్‌లు నిరంతరం కేంద్రాలను పరిశీలించాల న్నారు. అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, సిబ్బంది తప్పకుండా సమయపాలన పాటిస్తూ విధులను నిర్వహించాలని చెప్పారు. ఇక ముందు పౌష్టికాహారం పంపిణీ సక్రమంగా జరగకపోయినా; సిబ్బంది సమయపాలన పాటించక పోయినా ఆయా ప్రాంతాల ప్రజలు తమకు నేరుగా ఫిర్యాదు చేయాలని తెలిపారు.

రారండోయ్..వేడుక చూద్దాం



అలరించిన వీరశైవుల నృత్యాలు



బ్రహ్మోత్సవాల నిర్వహణ కోసం దుస్తులు తీసుకొస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు

- వైభవంగా ప్రారంభమైన శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు
- వేదమంత్రాలు, భక్తుల నృత్యాల మధ్య ధ్వజారోహణం



బ్రహ్మోత్సవాల సందర్భంగా ధ్వజారోహణం నిర్వహించిన దృశ్యం

రాయచోటిటౌన్: అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో శ్రీభద్రకాళీ సమేత శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితుల వేదమంత్రాలు, భక్తుల నృత్యాల మధ్య ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఈవో డీవీ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డి, పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా నందుల మఠం సిద్ధాంతి శశిభూషణ సిద్ధాంతి ఆచార్యత్వాన బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. తెల్లవారు జామున యాగ శాల ప్రవేశం, శ్రీ మహాగణపతి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, వేదపండితులు, ఆలయ ప్రధాన అర్చకులు కంకణ దీక్ష చేపట్టారు. శశిభూషణ సిద్ధాంతి బ్రహ్మోత్సవ నిర్వాహకులకు కంకణధారణ చేశారు. ముందుగా స్వామి, అమ్మవారు, పరివార దేవతలను ఊరేగింపుగా తీసుకొచ్చి పూజలు జరిపారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులకు సంప్రదాయ పద్ధతిలో ఉత్సవాలు నిర్వహించడానికి దుస్తులు అందజేశారు. అనంతరం ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కన్నడ, వీరశైవ భక్తులు చేసిన నృత్యాలు అలరించాయి. భక్తులకు ఉచిత భోజనం ఏర్పాటు చేశారు. అనంతరం దర్శన ఏర్పాట్లు చేశారు.

పిల్లల చదువుపై తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి



మాట్లాడుతున్న డీఈవో రాఘవరెడ్డి

రాయచోటి టౌన్ : త్వరలో పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తమ పిల్లల చదువు, ప్రగతిపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఈవో రాఘవరెడ్డి అన్నారు. బుధవారం రాయచోటి ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు నేర్పించిన విద్యకు ఇంటివద్ద తల్లిదండ్రులు తర్ఫీదు ఇస్తే పిల్లలు చదువులో చురుగ్గా ఉంటారని, ఎలాంటి భయం లేకుండా పరీక్షలు రాస్తారని చెప్పారు.పాఠశాలకు రూ.25 వేలు విలువ చేసే మైక్ సెట్‌ను ఎం. శ్రీనివాసుల రెడ్డి (కోడి శ్రీనివాసుల రెడ్డి) వితరణగా అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయజుర్ రహిమాన్ పాల్గొన్నారు.

జెడ్పీ ఉన్నత పాఠశాల పరిశీలన



సంబేపల్లెలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పర్యటించిన కేంద్ర బృందం

సంబేపల్లె : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నతపాఠశాలను బుధవారం కేంద్ర బృందం పరిశీలించింది. బృందంలో సెంట్రల్ వాటర్ కమిషన్ అసిస్టెంట్ డైరెక్టర్ నందిని, జ్ఞానేశ్వర్‌రావు ఉన్నారు. ఈ సందర్భంగా జల సంరక్షణకోసం పాఠశాలలో అమలు చేస్తున్న విధానాలను పరిశీలించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేందుకు పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా పాఠశాలలో 3000 మొక్కలు నాటి వాటి సంరక్షణ కోసం తీసుకున్న చర్యలను, డ్రిప్పులను పరిశీలించారు.

- ప్రతిష్టాత్మకమైన 4వ జాతీయ జల అవార్డు(నేషనల్ వాటర్‌అవార్డ్స్) పరిశీలనలో సంబేపల్లె జెడ్పీఉన్నత పాఠశాల ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి తెలిపారు.ప్రతి ఏటా దేశ వ్యాప్తంగా జల సంరక్షణలో ఉత్తమ విధానాలు ప్రదర్శించే 3 పాఠశాలలకు కేంద్ర జల మంత్రిత్వశాఖ అవార్డు ఇస్తుందన్నారు. గత సంవత్సరం అక్టోబర్‌లో దరఖాస్తు చేశామన్నారు. తుది జాబితాలో సంబేపల్లె జెడ్పీఉన్నత పాఠశాలకు చోటు దక్కడం ఆనందంగా ఉందన్నారు.

వేడెక్కుతోంది!

- ఫిబ్రవరి రెండో వారం నుంచే పెరిగిన ఎండ తాకిడి
- రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఏప్రిల్, మే నెలల్లో తీవ్రంగా ఉంటాయని వాతావరణ నిపుణుల హెచ్చరికలు
- రానున్న కాలంలో ఉష్ణప్రభావం, వేడి గాలులతో వడదెబ్బ సోకే ప్రమాదం
- వేసవిని దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



మధ్యాహ్న సమయంలో బోసిపోయిన రాయచోటి-కడప ప్రధాన రహదారి

సాక్షి రాయచోటి : భానుడు ప్రచండ నిప్పులు చెరిగే కాలం ఆసన్నమైంది. మొన్నటి వరకు చలితో అల్లాడిపోయిన జనం ఇక ఎండా వేడిమిని తట్టుకునేందుకు సిద్ధం కావాలి. ఎండ ప్రభావం పెరుగుతుడటంతో సామాన్య ప్రజలతో పాటు ఉద్యోగులు అప్రమత్తం అవుతున్నారు. మధ్యాహ్న సమయంలో బయటికి తక్కువగా వెళ్లేలా ఇప్పుడే ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఎందుకంటే ప్రతిసారి అత్యధిక ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదవుతున్న తరుణంలో జాగ్రత్తలు పాటించకపోతే ముప్పును ఎదుర్కొనే ప్రమాదముంది. అందులోనూ ఈసారి కూడా ఎప్పటిలానే వేసవిలో వడగాలులతోపాటు ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎండాకాలంలో భానుడి ప్రభావం అధికంగా ఉంటుంది కనుక చిన్నారులు మొదలుకుని పెద్దల వరకు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటివరకు ఉన్న వాతావరణం వేరు.. రానున్న కాలంలో పరిస్థితులు వేరుగా ఉంటాయి. ఎండల నేపథ్యంలో కూలిపనులకు వెళ్లేవారు కూడా ఉదయం పూటనే పనులు చేసి.. మధ్యాహ్నం లోపు ఇంటికి చేరేలా అధికారులు అప్రమత్తం కావాలి. ప్రస్తుతం వేసవికాలం ఆరంభం అయ్యిందో లేదో అంతలోనే ఎండలు దాడికి సిద్ధమవుతున్నాయి. ఫిబ్రవరి రెండవ వారం నుంచి ఎండలు ముదురుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉదయం పూట అంతగా లేకున్నా మధ్యాహ్నం అయ్యేసరికి కొంత ప్రభావం కనిపిస్తోంది.

వడదెబ్బతో జాగ్రత్త

జిల్లాలో ప్రతి ఏడాది వేసవి వచ్చిందంటే వడదెబ్బ ప్రజలను ఎక్కువగా దెబ్బతీస్తోంది. వడదెబ్బ ధాటికి చాలామంది మృత్యువాతపడిన ఘటనలు ఉన్నాయి. కాకపోతే వడదెబ్బ ఒక్కోసారి ప్రాణాల మీదికి తీసుకువస్తుంది. వేసవికాలంలో అధికంగా వడదెబ్బ కేసులే నమోదయ్యే పరిస్థితి నెలకొంది. అయితే వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురవుతున్న వారి సంఖ్య అధికంగానే ఉంది.

గొడుగులు, టోపీలు, కళ్ల అద్దాలకు డిమాండ్

ఫిబ్రవరి ప్రారంభం నుంచి చలి తీవ్రత క్రమక్రమంగా తగ్గుతోంది. చలి తగ్గడం.. ఎండల ప్రభావం కనిపిస్తోంది. ఎండలో తిరుగుతున్నా కనీసం కొంతమేరకైనా ఉపశమనం ఉంటుందని భావించి గొడుగులు, టోపీలు, టవళ్లు, కర్ఛీఫ్‌లు కొనుగోలు చేస్తున్నారు. వాహనదారులు కూడా కళ్లకు సంబంధించి జాగ్రత్తలో భాగంగా రకరకాల కళ్లద్దాలను కొనుగోలు చేస్తున్నారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

అన్నమయ్య జిల్లాలో గత ఏడాది సుమారు 41-44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అందులోనూ వైఎస్సార్ జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు, పులివెందుల, కడపతో పాటు అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి, పీలేరు, రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో కొంతమేర ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉంది. మదనపల్లె చల్లటి వాతావరణానికి మారుపేరుగా నిలుస్తుండడంతో అంతగా ప్రభావం ఉండకపోవచ్చు. మార్చి నెల చివరి నుంచి ఎండల తీవ్రత మరింత పెరగనుంది. ఏప్రిల్, మే నెలల్లో ఎండలు తీవ్ర ప్రభావం చూపనున్నాయి.

జాగ్రత్తలు పాటించాలి



వేసవి నేపథ్యంలో ప్రధానంగా చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలి. మిగిలిన వారికి కూడా వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి. అయితే వృద్ధులు, చిన్నారులు వడదెబ్బ, అస్వస్థతకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ మహేశ్వరరాజు, వైద్య నిపుణుడు, రాయచోటి

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం

కలికిరి : వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేష్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కలికిరి గ్రామ పంచాయతీ, కె.రెడ్డివారిపల్లి గ్రామం తుమ్మలపేట వడ్డిపల్లికి చెందిన వి.నాగమల్లయ్య(32) తాపీ మేస్త్రీగా పనిచేసేవాడు. ఈ నెల 9న మేస్త్రీ పనికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో నాగమల్లయ్య భార్య వి.అశ్విని బంధువులు, తెలిసిన వారిని విచారించినా భర్త ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ తెలిపారు.

మైనర్ బాలిక వేధింపుల కేసులో యువకుడి అరెస్ట్

నిమ్మనపల్లె : మైనర్ బాలికను వేధించిన కేసులో నిందితుడైన యువకుడిని అరెస్ట్ చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ సుకుమార్ తెలిపారు. మండలంలోని తవళం గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికను గంగాపురంపల్లెకు చెందిన చెంజి ప్రశాంత్(25) మాయమాటలు చెప్పి మోసం చేసే ప్రయత్నం చేశాడు. నిందితునిపై బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు వేధింపులు, పోక్సో కేసులు నమోదుచేశారు. బుధవారం నిందితుడైన ప్రశాంత్ తవళం రోడ్డులోని బుచ్చిరెడ్డిపల్లె బస్టాప్ వద్ద ఉండగా ఎస్ఐ పోలీసులతో కలిసి అతన్ని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఒంటిమిట్టలో విశేష పూజలు



రామయ్య సన్నిధిలో మేనేజింగ్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలోని సీతా రామలక్ష్మణ మూర్తులను బుధవారం జేఎస్ డబ్ల్యూ మేనేజింగ్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి ఆలయ లాంచనాలతో స్వాగతం పలికి, ఆలయ ప్రదక్షణ కావించి, సీతారామలక్ష్మణ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ రంగమండపంలో అర్చకులు ఆయనను సత్కరించి, స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.

సీఎం వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం



సీఎం వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



మంత్రి ఆదిమూలపు సురేష్



ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి



ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఎమ్మెల్సీ రమేష్ యాదవ్



మాజీ మంత్రి రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు మండలం సున్నపురాళ్ల పల్లిలో జేఎస్ డబ్ల్యూ స్టీల్ ప్లాంటుకు భూమిపూజ నిర్వహించే నిమిత్తం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం ఉదయం గన్నవరం విమానాశ్రయం నుంచి విమానంలో బయలుదేరి కడప విమానాశ్రయం చేరుకున్నారు. అనంతరం కడప విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లికి ఉదయం 10.56 గంటలకు చేరుకున్నారు.ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి... ఉప ముఖ్యమంత్రి ఎస్ బి అంజద్ బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్నాథ్ , జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, జమ్మలమడుగు, మైదుకూరు ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి రఘురామి రెడ్డి, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి, కడప నగర మేయర్ సురేష్ బాబు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.



భూమిపూజ సందర్భంగా మొక్క నాటి నీరు పోస్తున్న సీఎం వైఎస్ జగన్



జానపద విజ్ఞాన గ్రంథాల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సీఎం వైఎస్ జగన్



పులివెందులలో నూతన వధూవరులు, వారి కుటుంబ సభ్యులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



పులివెందులలో ప్రజలకు అభివాదం తెలియజేస్తున్న సీఎం వైఎస్ జగన్

చెరువులో పడి విద్యార్థి మృతి



మృతి చెందిన తాళ్లపాక చరణ్‌తేజ్

రాజంపేట : బోయనపల్లె జడ్పీ హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న తాళ్లపాక చరణ్ తేజ్ (11) మన్నూరు చెరువులో పడి మృతి చెందాడు. ఎల్లాగడ్డ అరుంధతీవాడకు చెందిన చరణ్‌తేజ మరో ముగ్గురు కలిసి బహిర్భూమికి వెళ్లారు. ఈ క్రమంలోనే చెరువులో ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రాజంపేట రూరల్ ఏఎస్ఐ సుబ్బయ్య తెలిపారు. కాగా ఈ విద్యార్థి మృతి పట్ల హెడ్మాస్టర్ శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు సుబ్బారెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. విద్యార్థి మృతితో బోయినపల్లి హైస్కూల్‌లో విషాదఛాయలు అలముకున్నాయి.

ఎస్పీఎల్ విజేత తిరుపతి



జూనియర్ విభాగంలో ట్రిపుల్ ఐటీ జట్టుకు విన్నర్స్ ట్రోఫీని అందజేస్తున్న జేఎన్‌టీయూ (ఏ) వీసీ జింకా రంగజనార్ధన



సీనియర్ విభాగంలో విన్నర్స్ ట్రోఫీని అందుకుంటున్న తిరుపతి సీకాం డిగ్రీ కళాశాల జట్టు



సీనియర్ విభాగంలో రన్నర్స్ ట్రోఫీని అందుకుంటున్న ప్రొద్దుటూరు ఎస్ఆర్ఎస్‌సీ డిగ్రీ కళాశాల జట్టు

- జూనియర్ విభాగంలో ఇడుపులపాయ జట్టు
- అట్టహాసంగా ముగిసిన సాక్షి ప్రీమియర్ లీగ్ రీజనల్ స్థాయి క్రికెట్ పోటీలు

SPL SAKSHI PREMIER LEAGUE

SAKSHI సాక్షి SAKSHI DIGITAL MEDIA GROUP

అనంతపురం సప్తగిరి సర్కిల్ : 'సాక్షి ప్రీమియర్ లీగ్' రీజినల్ స్థాయి సీనియర్ విభాగం క్రికెట్ పోటీల విజేతగా తిరుపతి సీకాం జట్టు, జూనియర్స్ విభాగంలో వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ జట్టు నిలిచాయి. 'సాక్షి' మీడియా గ్రూపు ఆధ్వర్యంలో నిర్వహించిన అనంత క్రీడాగ్రామం వేదికగా రెండు రోజుల పాటు సాగిన ఎస్పీఎల్ రీజినల్ స్థాయి పోటీలు ఆద్యంతం ఉత్కంఠగా సాగాయి. బుధవారం ఆర్డీటీ ప్రధాన స్టేడియంలో నిర్వహించిన ఫైనల్స్‌లో సీనియర్ విభాగంలో సీకాం జట్టు (తిరుపతి) ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల జట్టు (ప్రొద్దుటూరు), జూనియర్ విభాగంలో ట్రిపుల్ ఐటీ (వైఎస్సార్), సీకాం జూనియర్ కళాశాల (తిరుపతి) జట్లు తలపడ్డాయి.

ధరణి మెరుపు బ్యాటింగ్

సీనియర్ విభాగం ఫైనల్స్‌లో సీకాం డిగ్రీ కళాశాల (తిరుపతి) జట్టుపై ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల (ప్రొద్దుటూరు - వైఎస్సార్ జిల్లా) జట్టు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 79 పరుగులకు పరిమితమైంది. జట్టులో విజయ్ 25 బంతుల్లో 2 ఫోర్లతో 30 పరుగులు, మరో బ్యాటర్ శివకేశవ 16 బంతుల్లో 1 సిక్సర్‌తో 20 పరుగులు సాధించారు. సీకాం బౌలర్లలో శశాంక్ 2, సుబ్బు 1 వికెట్ కూలదోశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన సీకాం జట్టు 7.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. జట్టులో ధరణి మెరుపు బ్యాటింగ్‌తో జట్టును విజయతీరాలకు చేర్చాడు. మొత్తం 23 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 52 పరుగులు సాధించాడు. ఎస్‌కేఎస్‌సీ బౌలర్లలో వెంకటేష్ 1 వికెట్ దక్కించుకున్నాడు. 8 వికెట్ల తేడాతో తిరుపతి సీకాం జట్టు విజయ కేతనం ఎగురవేసి, త్వరలో విజయవాడ వేదికగా సాగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది.

రీజినల్ స్థాయి మ్యాచ్‌లో చెలరేగిన ట్రిపుల్ ఐటీ

అనంత క్రీడాగ్రామంలోని హాకీ మైదానం వేదికగా బుధవారం ఉదయం నిర్వహించిన జూనియర్స్ విభాగం రీజినల్ మ్యాచ్‌లో ట్రిపుల్ ఐటీ (ఇడుపులపాయ - వైఎస్సార్ జిల్లా), ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఆత్మకూరు - అనంతపురం జిల్లా) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి ఆత్మకూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇడుపులపాయ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 141 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. జట్టులో చేతన్ 23 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 60 పరుగులు, రాంబాబు 25 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 48 పరుగులు సాధించారు. ఆత్మకూరు బౌలర్లలో మనోజ్, జయ చెరో వికెట్ కూలదోశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆత్మకూరు జట్టు 9.4 ఓవర్ల వద్ద 60 పరుగులకే కుప్పకూలింది. జట్టులో వెంకట్ ఒంటరి పోరు సాగిస్తూ 12 బంతుల్లో 6 ఫోర్లతో 25 పరుగులు సాధించాడు. ఇడుపులపాయ బౌలర్లలో ప్రకాష్, హర్ష, చరణ్ చెరో 2 వికెట్లు కూలదోశారు. 81 పరుగులతో ఇడుపులపాయ జట్టు భారీ విజయాన్ని నమోదు చేసి ఫైనల్‌కు చేరుకుంది.

ఉత్కంఠ రేపిన 'జూనియర్స్'

ఆర్డీటీ ప్రధాన క్రీడామైదానంలో నిర్వహించిన జూనియర్ విభాగం ఫైనల్స్‌లో సీకాం జూనియర్ కళాశాల (తిరుపతి) జట్టుపై టాస్ గెలిచి ట్రిపుల్ ఐటీ (ఇడుపులపాయ - వైఎస్సార్ జిల్లా) జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేసింది. జట్టులో ప్రకాష్ 12 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 34 పరుగులు, మరో బ్యాటర్ రాంబాబు 25 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 26 పరుగులు సాధించారు. తిరుపతి బౌలర్లలో గౌతం 3, ముఖేష్ 2 వికెట్లు కూలదోశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన తిరుపతి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది. చివరి ఆరు బంతుల్లో 20 పరుగులు సాధించాల్సి ఉండగా క్రీజ్‌లో హర్ష, బాలాజీ ఉన్నారు. తొలి బంతిని బ్యాటర్ బౌండరీ దాటించడంతో ట్రిపుల్ ఐటీ క్రీడాకారులు ఒత్తిడికి లోనయ్యారు. ఈ క్రమంలో రెండో బంతిని బౌలర్ డాట్ చేశాడు. మూడో బంతిని బ్యాటర్ సిక్సర్ బాదడంతో తిరిగి ఉత్కంఠ నెలకొంది. ఇక మిగిలిన మూడు బంతుల్లో పది పరుగులు సాధించాల్సి ఉండడంతో ఇరు జట్ల క్రీడాకారులతో పాటు చూస్తున్నప్రేక్షకులు సైతం ఊపిరిబిగబట్టారు. నాల్గో బంతిని బౌలర్ వైడ్ వేయడంతో తిరుపతి క్రీడాకారుల్లో ఆశలు చిగురించాయి. ఐదో బంతికి బ్యాటర్ సింగిల్ రన్ చేశాడు. మిగిలిన చివరి రెండు బంతుల్లో ఎనిమిది పరుగులు సాధించాల్సి ఉంది. ఆరో బంతిని బ్యాటర్ సిక్సర్ బాదడంతో ఒక్కసారిగా తిరుపతి క్రీడాకారులు కేరింతలు కొట్టారు. విజయం తమదేనన్న ధీమా అందరిలోనూ వ్యక్తమైంది. అయితే ట్రిపుల్ ఐటీ బౌలర్ ఏడో బంతిని చాకచక్యంగా డాట్ చేయడంతో ఊహించని విధంగా విజయం ట్రిపుల్ ఐటీ వశమైంది. ఒక్క పరుగు తేడాతో విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది.

ఓటమి గెలుపునకు తొలిమెట్టు

ఏ క్రీడలోనైనా ఓటమి అనేది తర్వాత సాధించే గెలుపునకు తొలి మెట్టుగా ఉపయోగపడుతుందని జేఎన్‌టీయూ (ఏ) వీసీ జింక రంగజనార్ధన అన్నారు. ఎస్పీఎల్ రీజనల్ స్థాయి పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై, మాట్లాడారు. గెలుపు ఆనందాన్ని అందిస్తే ఓటమి భవిష్యత్తుపై ఆశలు రేపుతుందన్నారు. ప్రతి క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు. యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ చక్కటి అవకాశాన్ని ఇచ్చిన 'సాక్షి' మీడియా గ్రూపును అభినందించారు. రైవర్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఓటమి గెలుపునకు నాంది అవుతుందని, ఎన్నో సవాళ్లను ఎదుర్కొనేందుకు తొలి మెట్టుగా దోహదపడుతుందని అన్నారు. రాయలసీమ స్థాయి టోర్నీ నిర్వహణకు సహకరించిన ఆర్డీటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విజేతలకు ట్రోఫీలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో 'సాక్షి' అనంతపురం బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్, ఏడీవీటీ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు, ఈవెంట్ మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మండలంలోని బసినికొండ పంచాయతీ మొలకలదిన్నెక్రాస్‌కు చెందిన గాయత్రి(20) కుటుంబసమస్యల కారణంగా భర్తతో గొడవపడింది. మనస్తాపం చెంది బుధవారం ఇంట్లోనే సూపర్‌వాస్మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దుబ్బిగానిపల్లె పంచాయతీ రాయనచెరువువడ్డిపల్లెకు చెందిన ఈశ్వరప్ప(40) ఇటుకలబట్టీలో పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఇటీవల అనారోగ్యం కారణంగా బుధవారం కడుపునొప్పి అధికమవడంతో భరించలేక ఇంట్లోనే పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబసభ్యులు బాధితుడ్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా పట్టణంలోని చంద్రాకాలనీకి చెందిన రోషిణి(20) కుటుంబ సమస్యలతో బుధవారం ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హైవే మధ్యలో నిలిచిపోయిన లోడ్ లారీ



నిలిచిపోయిన లారీ వద్ద ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న ఏఎస్ఐ శంకర్‌నాయక్

నందలూరు (రాజంపేట) : కడప–రేణిగుంట నేషనల్ హైవేలోని నందలూరు బస్టాండు సర్కిల్‌లో బుధవారం సాయంత్రం నంద్యాలకు వెళ్లే లోడ్‌లారీ కదలకుండా నిలిచిపోయింది. ప్రధానంగా రోడ్డు మధ్యలో లారీ నిలిచిపోవడం, పైగా సర్కిల్ కావడంతో వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న ఏఎస్ఐ శంకర్‌నాయక్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. పైగా సీఎం జిల్లాకు వచ్చిన నేపథ్యంలో అనేక మంది తిరుగు ప్రయాణంలో తిరుపతి కి వీఐపీలు, ఉన్నతాధికారులు వెళ్లే పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు నిలిచిపోయిన లారీని తొలిగించేందుకు చర్యలు చేపట్టారు. ఈ మార్గంలో వెళ్లే అంబులెన్స్‌లకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. మరోవైపు లారీ మొరాయించిన ఫలితంగా ఈ మార్గంలో వెళ్లాల్సిన వాహనాలు బారులు తీరాయి. రెండు గంటలకుపైగా బారులు తీరిన వాహనాలను పోలీసులు క్లియర్ చేశారు. ఏఎస్ఐ శంకర్‌నాయక్ రాజంపేట నుంచి మెకానిక్‌ను రప్పించి లారీ మరమ్మతు చేయించి సమస్య పరిష్కరించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



వెంకటరమణ మృతదేహం

నిమ్మనపల్లె : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం రాత్రి నిమ్మనపల్లె మండలంలో జరిగింది. రాచవేటివారిపల్లె పంచాయతీ గొల్లపల్లెకు చెందిన శిరసాని వెంకటరమణ(50) మంగళవారం పొలం వద్ద పగలు వరినాట్లు వేసి సాయంత్రం కుటుంబసభ్యులతో ఇంటికి బయలుదేరాడు. అయితే పంట నాశనం చేసేందుకు కొంగలు వస్తాయని, కొంతసేపు పొలం వద్దే ఉంటానని కొడుకు మణికంఠకు చెప్పి వెంకటరమణ అక్కడే ఉన్నాడు. అరగంట తర్వాత వెంకటరమణ ఊరికి సమీపంలోని రాళ్లంగాళ్ల చేను దగ్గర చింతచెట్టు కింద పడిపోయి ఉన్నాడని కొడుకు మణికంఠకు సమాచారం అందింది. వెంటనే వెళ్లి చూడగా వెంకటరమణ అచేతనావస్థలో పడి మృతి చెంది ఉండటాన్ని గమనించాడు. సమాచారాన్ని నిమ్మనపల్లె పోలీసులకు అందించి తండ్రి మృతిపై అనుమానం వ్యక్తం చేశాడు. దీంతో మదనపల్లె రూరల్ సీఐ శివాంజనేయులు పోలీసులతో కలిసి సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఇటీవల గ్రామంలో ప్రతీకారహత్యలు జరగడంతో వెంకటరమణ మృతిపై పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. అంతేకాకుండా మృతుడి కుమారుడు మణికంఠ తండ్రి మృతిపై అదే గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి, జంగిటి వెంకటరమణ, జంగిటి సుబ్రహ్మణ్యం, జంగిటి మల్లికార్జునలపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆమేరకు హెడ్‌కానిస్టేబుల్ రమేష్‌బాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

50 మామిడిచెట్లు దగ్ధం



నిప్పుపెట్టడంతో పూర్తిగా కాలిపోయిన మామిడిచెట్లు

చిన్నమండెం : గుర్తు తెలియని ఆకతాయిల చేష్టలతో 50 మామిడిచెట్లు పూర్తిగా కాలిపోయిన ఘటన చిన్నమండెం మండలంలో చోటు చేసుకుంది. బాధిత రైతుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని కొత్తపల్లె పంచాయతీ గరుగుపల్లె గ్రామంలో పెద్ద వీరయ్య, శకుంతల, శంకర్‌రెడ్డి, భాస్కర్, సురేంద్రలకు చెందిన మామిడితోటలు ఉన్నాయన్నారు. అయితే బుధవారం మధ్యాహ్నం ఎవరో గుర్తు తెలియని ఆకతాయిలు నిప్పుపెట్టడంతో సుమారు 50 మామిడిచెట్లు కాలిపోయాయన్నారు. విషయాన్ని అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారాన్ని చేరవేశారు. అయితే ఫైరింజన్ వచ్చేందుకు ఆలస్యం కావడంతో విద్యుత్ శాఖ ఏడీ చిన్నస్వామినాయక్ చొరవతో వ్యవసాయ కరెంటు సప్లై చేయించుకొని మోటార్ల ద్వారా మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఉద్యానవన శాఖాధికారిణి వనిత జరిగిన సంఘటనపై ఉన్నతాధికారులకు సమాచారం చేరవేశారన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు.